


# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుడ్ని చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

### కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో
### అలనాటి అందమైన నవల పునర్ముద్రణ

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

"ఆ ఏం?"

"ఏం లేదు. అప్పుడు నీకేమనిపిస్తుంటుంది?"

"ఆశ్చర్యంగా వుంటుంది. మనకి తెలియని ప్రపంచం ఇంకా ఎంత వుందో అనిపిస్తుంది. మన చుట్టుప్రక్కల యిలాంటి గండిపడ్డ జీవులు విపరీత విషాద మనస్కులు మనకు అంతగా కనబడరు. ఉదాహరణకు మా కాలేజీ లేడీ స్టూడెంట్స్‌నే తీసుకుందాం. మెకానికల్‌గా చదువుకోవటం, పరిస్థితుల్ని బట్టి అబ్బాయిలకి దగ్గరగా రావటం, అప్పుడప్పుడు మితిమీరటం, వొట్టి ఏబ్రాసితనం తప్ప ఓ ఉత్సాహం, ఆరాటం, జిజ్ఞాస, లోతు ఏమీ కనబడవు. కాని మరి అలాంటి వాళ్ళు

మనకి కనిపించకుండా చాలామంది వుంటూనే ఉన్నారు. ఎలాగో కదిలించబడి సన్నిహితముగా వస్తూనే వున్నారు. అదే ఆశ్చర్యం."

శైలజ నిట్టూర్చి "నేనూ నీకు సిన్సియర్ ఫ్యాన్నే. అబ్బ! ఆ పుస్తకాలు ఎలా కదిలించాయి నన్ను" అంది.

అతను చకితుడయినాడు. ఓ క్షణం వూరుకుని "కాని అవి నేను తప్ప ఇంకెవయినా రాసి వుంటే మీరు ఉత్తరం రాసివుండేవాళ్ళు కాదు. నేను పరిచయస్థుడ్ని కావడం చేత మీ మనస్సు, పొజిషన్ అభ్యంతరం చెప్పలేకపోయినై" అన్నాడు.

శైలజ ఆశ్చర్యంగా "నిజమే. అలాంటి అహంభావం నాకు ఉంది" అని ఒప్పుకుంది.

ఆ రాత్రి భోజనాలు అయినాక తనకోసం ఏర్పాటు చేసిన గదిలోకి పోతుండగా ప్రక్కన ఓ బల్లమీద సితార్ కనిపించింది. దానిమీద అతను ఈ మధ్య సాధనం చేశాడు. ఒక వాద్యం బాగా వచ్చినవాడికి మిగతా తేలిగ్గా అలవాటు పడిపోతాయి. అనుకోకుండా తలలో ఓ సంపర్కం తెలుస్తూ వుంటుంది. అతనికి  సితార్ మీద వాయించటం బాగానే వచ్చింది. దాన్ని జాగ్రత్తగా పట్టుకుని గదిలోకి తీసుకువెళ్ళాడు.

ఈ మధ్య విడుదల అయిన సినిమాలో శైలజ పాడిన పాటే వాయించసాగాడు సోఫాలో కూర్చుని.

శైలజ తన గదిలోంచి బయటకు వస్తూ యీ మధుర మంజులగానం ఆలకించింది. నెమ్మదిగా, చప్పుడు చేయకుండా వెళ్ళి గుమ్మం ఇవతల నిలబడింది.

కొన్ని నిముషాలైనాక పాట ముగిసింది.

మధుబాబుకు ఏదో అనుమానం తోచి, ఆమెని చూసి లజ్జితుడయి "మీరా? ఎంతసేపయింది వచ్చి? వొట్టి పిచ్చి నాకు" అన్నాడు.

శైలజ లోపలకు వచ్చి మరో కుర్చీలో కూర్చుని "నీకు రాని విద్య అంటూ లేదా చినబాబూ? ఏదో మరొకటి వాయించు, చాలా ఆసక్తిగా వుంది" అని  అడిగింది ఎంతో కుతూహలంగా.

"క్షమించాలి .ఇవి నా ఆనందం కోసం నేను నేర్చుకున్నవి. ఎందుకూ పనికిరానివి. గట్టిగా ఎవరయినా అడిగితే చెయ్యి కదలదు."

"బ్రతిమాలినా అంతేనా?"

"బ్రతిమలాడ వద్దని నేనూ బ్రతిమలాడాల్సి వస్తుంది."

శైలజ నవ్వింది "నీకు మృదుత్వం, పెంకితనం రెండు ఉన్నాయి చినబాబూ" అంది.

మధుబాబు ఆలోచించసాగాడు. ఆమెలో ఏదో వేదన వున్నట్లు అతనికి పొడగట్టింది. అందుకనే తన సాన్నిహిత్యం కోరిందేమో. బహుశా అది బయటకు చెప్పలేకపోవచ్చు.

"చినబాబూ!" అంది శైలజ కంపిత స్వరముతో అతని కళ్ళలోకి చూస్తూ.

అతను ప్రశ్నార్ధకంగా చూశాడు.

"ఆ పుస్తకాలు ఎందుకలా రాశావు?"

"ఎలా?"

"అలా?"

"ఎలా?"

"అవి చదువుతున్నంతసేపూ నేనేడుస్తూనే ఉన్నాను. నా జీవితంలో ఏదో సంఘటనతో అవి పోలాయని కాదు. కాని అజ్ఞాతంగావున్న నాలోని అసంతృప్తికి అవి రూపాన్నిచ్చాయి. ఎన్ని తిరుగుళ్ళు, ఎత్తు పల్లాలు, మలుపులు, అసహ్యం నా జీవితం. ఆ యిన్సిపిరేషన్‌లోనే నిన్ను రమ్మని ఉత్తరం రాశాను. అవునుగాని నేనిందులోకి ఎలా వచ్చానని అడగవేం?"

"కుతూహలం లేదు."

"ఎందుకని?" అనడిగింది ఆమె కొంచెం గాయపడి.

"కొత్త ఏమీ వుండదు. పేర్ల మార్పుతో, సంఘటనల తేడాతో మీ అందరి కథలూ ఇంచుమించు ఒకలాగే వుంటాయి. గుండ్రంగా తిరిగే జీవిత చరిత్రలు."

"నువ్వు కఠినుడివి" అంది.

"ఇంతకుముందే మృదువైన వాడివన్నారు. అతి మృదుత్వం కూడా కఠినంగా కనబడుతుంది. అది అందరికీ అర్ధమయే సంగతి కాదులెండి" అని మధుబాబు ముఖం ప్రక్కకి తిప్పుకున్నాడు.

శైలజ తెల్లబోయి చూసింది. భయంతో, నిజాయితీలోని వ్యథతో ఆమె ముఖం పాలిపోయింది "నాకు మనశ్శాంతిలేదు" అంది పొడిగా.

మధుబాబు సితార్‌ని అవతలవుంచాడు. "ఉండదు ఒక్కోరకం మనుషులకి. ఆ మనశ్శాంతికోసం అన్వేషణలోనే జీవితమంతా సరిపోతుంది. ఈ స్థితి ఎక్కడవున్నా తప్పదు. మీరు రాజయ్యగారి ప్రాపకంలోనే, ఆ పెంకుటింట్లోనే ఉన్నా యీ మనశ్శాంతి లేక బాధపడేవారు. ఈ సినిమా లోకంలోకి రాకుండా ఎక్కడికైనా వెళ్ళి మరోరకంగా జీవించినా అదే అవస్థ. ఇప్పుడూ అంతే. అది మనుషుల్లోని దుర్భలత, రూపంలేని తృష్ణ అంతే."

శైలజ ఓ క్షణంపాటు అతని నిర్మల, అమాయక వదనంకేసి పరీక్షగా చూసింది.

"నీకు వుందా మనశ్శాంతి?"

"లేదు" జవాబు సూటిగా వచ్చింది.

"ఎందుచేత?"

మధుబాబు ఆమెకేసి భావశూన్యంగా చూశాడు. "దీనికి జవాబు చెప్పటం చాలా కష్టం."

"ఆంతరంగికమా?"

"కొంచెం అలాంటిదే."

"నువ్వు ఏ స్త్రీనైనా ప్రేమించావా?"

"ప్రేమించాను?"

"ఆమె ఎలాంటిది?"

"అంటే?"

"ఆమెని గురించి నీ ఇంప్రెషన్."

"చాలా గొప్పది. ఈ భూమ్మీద అలాంటి వ్యక్తులు అరుదుగా వుంటారు."

"మరి ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?"

"కర్మ. ఆమెకు అంతకుముందే పెళ్ళయిపోయింది."

శైలజ నిట్టూర్పు విడిచింది. "అందుకే నీ రచనలంత మధురంగా ఉన్నాయి" అంది.

"అందుకునేనా ...కాబోలు" అన్నాడు మధుబాబు అన్యమనస్కంగా.

"నీకు చాలా చెప్పాలనివుంది. ఏమీ చెప్పలేకపోతున్నాను" అంది శైలజ.

"నాకు తెలుసు"

"కారణం ఏమిటంటావు?"

మధుబాబు అనుకోకుండా చిన్న మందహాసం చేశాడు. "మనం ప్రతిదానికీ కారణం చెప్పలేం శైలజా. కారణం తెలీకుండా నన్నిక్కడకు రమ్మన్నారు కారణం తెలియకుండానే నేనిక్కడకు వచ్చాను. ఇద్దరిమధ్యా తెలియని ఆందోళన ఉంది. మళ్ళీ నేను పోయాక మీరు బాధపడతారు. నేను పడతాను. ఏదయితే ఇక్కడ గుప్తంగా ఉన్నదో అదే సత్యం" అన్నాడు.

శైలజ ఆలోచిస్తూ కూర్చుంది. ఇద్దరూ చాలాసేపటిదాకా మౌనంగా ఊరుకున్నారు. హఠాత్తుగా ఆమె ముఖం ఎత్తి డగ్గుత్తికతో "ఈ జీవితం బరువు మొయ్యలేకుండా ఉన్నాను. నేను కొద్ది రోజులలో ఏమయినా అయిపోవచ్చు. గతమూ, ప్రస్తుతమూ ,భవిష్యత్తు కూడా అసహ్యంగా అస్తవ్యస్తంగా కనిపిస్తోంది. కాని వీటన్నిటినుంచి తప్పించుకునే ధైర్యం, త్యాగం లేవు. ఒకవేళ ఎప్పటికయినా ఆపదలో నీ దగ్గరకు వస్తే సహాయం చేస్తావా?" అంది జాలిగా.

మధుబాబు అప్రతిభుడైపోయాడు. "తప్పకుండా" అన్నాడు వ్యతీతమైన కంఠంతో.

శైలజ లేచి నిలబడి "ఇహ పడుకుని నిద్రపో. నాగురించి అట్టే ఆలోచించకు. వస్తా" అంటూ అక్కడ్నుంచి గబగబా వెళ్ళిపోయింది.

ఆమె గొంతులోని వ్యధను గమనించి అతను విచలితుడయాడు. లేచి కిటికీ దగ్గరకు వచ్చి నిల్చున్నాడు. క్రింది తోటలోంచి రకరకాల పువ్వుల పరిమళం హాయిహాయిగా ఎగజిమ్ముతోంది. ఈ డబ్బు, సౌఖ్యం, యవ్వనం, కీర్తి, అన్నీ వుండి... ఏమిటో!

అతడు తల ఎత్తి ఆకాశంలోకి చూశాడు. జాబిలి మబ్బు చాటుకు జరుగుతున్నాడు.

మరునాడు కూడా అక్కడే గడిపి, ఆ మరుసటి రోజు అక్కడనుంచి వచ్చేశాడు మధుబాబు. పోస్ట్‌మేన్‌తో చెప్పటం వలన పాత అడ్రస్‌కి వచ్చిన ఉత్తరాలు కూడా ఇక్కడే ఇచ్చిపోతున్నాడు. తలుపు తీసి ఇంట్లోకి ప్రవేశించగానే నేలమీద కవరొకటి పడివుంది. దస్తూరి గుర్తుపట్టి అతని గుండె గబగబ కొట్టుకుంది.

**ఒట్టి అడవి మనిషికి,**

ఈ మధ్య నీ కొత్త పుస్తకం చదివాను. నాకేమీ బాగోలేదు. వింటున్నావా? ఏమీ బాగోలేదు. అబ్బ! ఐనా రానురానూ అంత విషాదజీవిగా తయారౌతున్నావేమిటి? ఎప్పటికైనా సరే యీ ప్రపంచం మీద మితిలేని అసహ్యం కలిగినప్పుడు నా దగ్గరకు వచ్చెయ్యి. ఏం.

**పద్మజ**

అతని గుండెలో ఏదో కెలికినట్లైంది. దిగాలుపడి కూర్చున్నాడు.

## 26

ఒక దశలో మానవుడు మానసికంగా పెరగటం ఆగిపోతాడు. ఎవ్వరూ ఎల్లకాలం పెరుగుతూ పోరు. ఎక్కడో నిలిచిపోయి శూన్యంలోకి చూస్తూ వూరుకుంటారు. అయితే ఇది స్థిరత్వంకాదు. జడత్వం అంతకంటే కాదు. తాత్కాలికమైన జుగుప్సా అంటే అదీ చెప్పలేము. మళ్ళీ భావిలో జీవితం కొత్త చిగుళ్ళు తొడగవచ్చు. మానసిక పరిణామం రావచ్చు. కాని ఈ స్థబ్ధమైన దశ అనుభవించకుండా మాత్రం ఎవ్వరూ ముందుకు పోలేరు.

మధుబాబు ప్రస్తుతం యీ దశలో వున్నాడు. ఫైనల్ ఇయరులోకి వచ్చాడు. యాంత్రికంగా హాస్పిటల్‌కి పోయి వస్తున్నాడు. పాఠాలు శ్రద్ధగా చదువుతున్నాడు. సాహిత్య ఉత్పత్తి ఏమీ చెయ్యలేదు. మత్తుగా, మౌనంగా వున్నాడు.

కాని ఆ వయస్సుకి అతను రాసిన రచనలు ఎక్కువ. అసూయాపరులు ద్వేషాన్ని వెలిగ్రక్కే స్థితికి అతడెన్నడో చేరుకున్నాడు. పాఠకుల్లో పేరు పెరిగేకొలదీ విమర్శకులు మరీ తప్పులెంచసాగారు. ఎంతపైకి వచ్చినా "పర్వాలేదు. పైకి వస్తాడనే" స్లోగన్ పత్రికలవాళ్ళు వదలటంలేదు.

అతివాదాలంటే అతనికి ఈ మధ్య మరీ చికాకు హెచ్చింది. ఈ మానసికమైన చిత్రవధను అతనింక అనుభవించదల్చుకోలేదు. ఈ మధ్య రైల్లో పోతూంటే ఓ రచయిత్రి కనిపించింది. విప్లవ వనితలా గోచరించింది. ప్రేమకూ, వివాహానికీ బొత్తిగా సంబంధం వుండనక్కరలేదంది. స్త్రీ హృదయం పుష్పక విమానమంది. ఎంతమందికైనా అందులో చోటు వుంటుందని ఆమె వాదం. నిజమే కావచ్చుననుకున్నాడు మధుబాబు.

ఒకరిలో కొన్ని గుణాలు చూసి ఇద్దర్నీ సమానంగా ప్రేమించటానికి అవకాశాలున్నాయి. ఇది సత్యమే కాని యీ వాద ప్రచారం తప్పనిసరి. ప్రేమలు ఎక్కువకావటానికీ ప్రతిదాన్నీ ప్రేమ అని పిలవ సాహసించటానికీ ఇంకా అవకాశాలున్నాయి. ఈ మధ్య ప్రతివాడూ 'ఉద్ధరింపు' అనేమాట విరివిగా ప్రయోగించటం ఫ్యాషన్ అయిపోయింది. ఉద్ధరింపుకు విపరీత అర్థాలు తీయటం జరుగుతోంది. జీవితంలో అనుభవ శూన్యులూ, ఏవో కొద్ది దారుణ సంఘటనలు చూసి అవే ప్రపంచ సత్యాలని అపోహపడే వాళ్ళూ, ఏదో ఓ కోణంలో వ్యక్తిగత కారణాలచేత దగాపడిన వాళ్ళూ అవే విశ్వజనీనం చేసి తాత్కాలిక ఉద్రేకంతో పొలికేకలు వేయటంవలన ఉద్ధరింపు జరగదు. మనలోలేని సంస్కారాన్ని ప్రజలకు పంచిపెడుతున్నాం. మనలోని బలహీనతల్ని ప్రజలమీద రుద్ది మన క్షేమం కోసం విశ్వవ్యాప్తం చేస్తున్నాము. మన వ్యక్తిగత జీవితమంతా బూజు, ఒట్టి ఆర్భాటము, పిరికితనము. కొన్ని సుఖాలకు కరువాచిపోయి, వాపి తీరక అతివాదాలు లేవదీస్తున్నాము. ఇలా తరుచుకుంటూ పోతే నిజాయితీ ఎక్కడ?

"స్త్రీని" ఎంతోమంది కన్న ఎక్కువగానే సానుభూతిగా చూశాడు మధుబాబు. ఆ అసహ్యం, అవివేకం, బానిసత్వం (ఇప్పటికి) , అత్యాచారాలు, అమానుషాలు తలచుకుని కన్నీరు కార్చాడు. ఆవేశపడ్డాడు. నిజమే. మన సంఘం కుళ్ళి కుళ్ళి దరిద్రంగా, ముదనష్టంగా తయారౌతోంది. కాని ఈ కంఠశోషలూ, తీవ్రవాదాలూ విని సంస్కారానికి సరయిన నిర్వచనం చెప్పుకుంటున్నదెంతమంది? అతను నిత్యం కాలేజీలో అంతమంది అమ్మాయిల్ని చూస్తున్నాడు, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ఎం.బి.బి.యస్ చదువూ, అన్నీ పొంది సంస్కారం అంటే అర్థం తెలియక ప్రేమశూన్యులయి, అసహ్యపు ముద్దల్లా తయారౌతున్న వీళ్ళని చూస్తుంటే అతనికి మతిపోతోంది. స్వేచ్ఛపొంది వీళ్ళు నిర్వహిస్తోన్నదేమిటి? ఊరగాయల గూళ్ళలోంచి, కూరల, పచ్చళ్ళ లోకాభిరామాయణం నుంచి బయటకు వచ్చిన నవీన స్త్రీ సినిమా కబుర్లూ, మిత్రుల శీలాన్ని గురుంచి మాట్లాడుతోందని, ఆదర్శం కోసం అలమటించిన మహావ్యక్తులే నిరాశ చెందుతున్నారు. స్వేచ్ఛకు అర్థం చెప్పుకోలేని వ్యక్తులు భూమ్మీద గుంపులు గుంపులుగా పోరాడుతూంటే ఆదర్శానికి ఆనకట్టలెందుకు? అది పిచ్చెక్కినట్లు పొంగి ప్రవహించేది. ఎక్కడ పల్లం వుంటే అటుకేసి జరజరపోతుంది. చివరకు మిగిలేది అరిచి అరిచి జీవితాన్ని అంకితం చేసుకున్న మహనీయుల వినిపించీ వినిపించని వ్యర్థ ఘోషలు.

ఒకరోజు సాయంత్రం ఓ స్నేహితుడితో కలిసి బజారు వెంట నడుస్తున్నాడు మధుబాబు. ఆ స్నేహితుడు కాలేజి గొడవలేవో చెబుతున్నాడు. అతను వింటున్నాడు.

ఇంతలో ఇద్దరు యువతులు వాళ్ళకెదురుగా వచ్చారు. మధుబాబువంక యధాలాపంగా చూసిన ఓ అమ్మాయి చప్పున చకితురాలై, స్నేహితురాల్ని మోచేతిమీద పొడిచి "అటుచూడు" అన్నది ఆతృతగా.

"ఏమిటే?" అంది స్నేహితురాలు.

"అతన్నెక్కడో చూసినట్లుగా వుంది... ఆ.. నవలలు రాసే మధుబాబు.. అవును అతనే" అంది మొదటి అమ్మాయి ఉత్సాహంగా.

"అయితే అయాడులే, ఏమిటి ఆ గాబరా?"

మధుబాబుకు యీ మాటలు లీలగా వినిపించాయి. పులకితుడయాడు. నవ్వుకుంటూ ముందుకు నడిచాడు.

స్నేహితుడు కాఫీ త్రాగుదామన్నాడు. ఇద్దరూ కలసి ప్రక్కనున్న కాఫీ హోటల్‌కి వెళ్ళారు.

"అతనిక్కడే ఎం.బి.బి.యస్ చదువుతూన్నట్లు పుస్తకాల వెనుక చూశాను. అతని రచనలంటే నాకెంతో ఇష్టం, కలుసుకుంటే బాగుండేది" అంది మొదటి అమ్మాయి విచారంగా.

"మరి అతన్ని నిలబెట్టి మాట్లాడలేకపోయావా?" అన్నది రెండో అమ్మాయి ఎగతాళిగా.

"అమ్మబాబోయ్. రోడ్డుమీదనా? అందులోనూ నేనా? మొగవాళ్ళతో మాట్లాడాలంటే నాకు చచ్చేభయం బాబూ."

" అయితే ఇహ దిగులెందుకు? పోదాం పద" అని రెండో అమ్మాయి ఆమె చెయ్యి పట్టుకు లాగింది.

"ఉండు ఉండు. కాసిని పువ్వులు కొనుక్కుపోదాం. ఎంత బాగున్నాయో చూడు ఆ తెల్లని మల్లెలు. తెల్లని మల్లెలన్నా, చల్లని వెన్నెలన్నా ఎంతో ఇష్టం నాకు" ఇద్దరూ రోడ్డు ప్రక్కనున్న పూల అంగడికి వెళ్ళారు.

పువ్వులు బేరం చేస్తున్నారుగాని స్నేహితురాలి చూపులన్నీ హోటలు గుమ్మం మీదేనని కనిపెట్టింది రెండో అమ్మాయి. లోలోపల నవ్వుకుంది. స్నేహితురాలి సాహిత్యపు పిచ్చి ఆమెకు తెలుసు. మరో పదినిమిషాల వరకూ ఇద్దరూ పువ్వులు కొంటూనే వున్నారు. మధుబాబు స్నేహితుడితో కలిసి బయటకు వచ్చాడు. రెండో అమ్మాయి హఠాత్తుగా స్నేహితురాలి చెయ్యి పట్టుకుని గబగబా వాళ్ళకు ఎదురుగా వెళ్ళి "నమస్కారమండీ. మీరు ప్రఖ్యాత రచయిత మధుబాబుగారు కదూ" అన్నది చొరవగా. మొదటి అమ్మాయి గుండె గబగబా కొట్టుకుంది. నేస్తురాలు చేసిన పనికి కోపం తెచ్చుకుంది. ఏమంటాడోనని దురుచూస్తోంది.

"కాదే" అన్నాడు మధుబాబు.

"కాకపోవటమేమిటి? మీ మొహం చెప్పటల్లా? ఏమండీ మీరు చెప్పండి. ఆయన పేరు అదేకదూ?" అన్నది ప్రక్కవాడికేసి తిరిగి తొణక్కుండా, బెణక్కుండా.

స్నేహితుడు కాస్త మాటకారే "మీరన్న ప్రఖ్యాతుడూ, ఈయనా ఒకటి అవునో కాదోగాని ఈయన పేరు మధుబాబే. రచయిత అయినమాట వాస్తవమే" అన్నాడు.

ఆమె చప్పున స్నేహితురాల్ని ముందుకు లాగుతూ "ఈ రాణీగారి పేరు ఇందిర. మీ పుస్తకాలంటే పడి చస్తుందిట. కలుసుకోవాలని ఊరికినే తహతహలాడ్తోంది. ఊ.. మాట్లాడవే" అంది దబాయిస్తూ.

ఇందిరకు వల్లమాలిన కోపం, సిగ్గూ రెండూ కలిగాయి. ఉడుకుమోత్తనం కూడా వచ్చింది. కాని యేం చేస్తుంది? వణుకుతూన్న చేతుల్తో నమస్కార్మ పెట్టి, రెప్పలు క్రిందకువాల్చి, నేల చూపులు చూస్తూ ఊరుకుంది.

మధుబాబు కూడా చేతులు జోడించి నమస్కారం చేశాడు.

"ఇంకేం మాటల్లేవా? అయిపోయిందన్నమాట. సరేపద. వస్తామండి. ఇది వట్టిమూగది. మాటలురావు" అంటూ ఇందిర చెయ్యిపుచ్చుకుని కదిలింది ఆ అమ్మాయి.

"మరి మీ పేరు చెప్పారు కాదేం?" అన్నాడు మధుబాబు స్నేహితుడు కొంటెగా.

"నా పేరా? మనిషిలాగే కొంచెం ఘాటుగా వుంటుందని..." అంటూ ఆమె వెళ్ళిపోయింది.

ఆదివారం మధ్యాహనం పనిమనిషి తెచ్చిన క్యారియర్‌తో భోజనం చేసి పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాడు మధుబాబు. ఇట్లా వంటరిగా కుర్చుని భోజనం చెయ్యటం దారుణమైన సన్నివేశం. ఎవరో చాటునుంచి పొంచి చూస్తున్నట్లూ, సానుభూతి ప్రదర్శిస్తున్నట్లూ వుంటుంది. నోట్లోకి ముద్దపోదు. వొంటరితనం చాలాకాలం వృధా ఆలోచన్లతో వ్యర్థం అయిపోతూంటుంది. అర్థంలేని జాలి మనమీద మనకు.

మెల్లగా మూడైంది. కాసేపు నిద్రపోదామనిపించింది మధుబాబుకు. ఈ మధ్యాహ్నం నిద్రకన్నా విషాదకరమైన సంఘటన లేదు. పట్టీపట్టనిస్థితి, ఉలిక్కిపడి లేచి కూర్చుండటం. తీరా టైము చూస్తే ఎక్కువ గడవకపోవటం.

బయట అడుగుల చప్పుడయాయి. యీ సమయంలో ఎవరూ రారే సాధారణంగా. తలుపుకొడతారేమోనని ఎదురు చూస్తున్నాడు. ఏదో కంఠస్వరం "మధుబాబుగారూ" అతను ఉలిక్కిపడ్డాడు. స్త్రీ కంఠం.

మధుబాబు అప్పుడు పైజమా, లాల్చీ వేసుకుని వున్నాడు. లేచి వెళ్ళి తలుపు తీశాడు.

ఆనాడు బజారులో కనిపించిన అమ్మాయిలు.

తడబడుతూ "లోపలకు రండి" అన్నాడు.

Post your comments

(కొనసాగింపు వచ్చే నెలలో)